క్లుప్తంగా

లారీని ఢీకొట్టిన కారు



మంగపేట : ఎదురుగా వస్తున్న లారీని (కంటైనర్) మధ్య భాగంలో కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని సంఘంపల్లికి చెందిన మహేష్, రాహుల్ రెడ్డి, మరో వ్యక్తితో కలిసి ఏటూరునాగారం నుంచి మంగపేట వైపు కారులో వస్తున్నారు. మార్గమధ్యలో కమలాపురం అంబేడ్కర్ సెంటర్ సమీపంలో మంగపేట వైపు నుంచి వస్తున్న లారీని క్రాస్ చేసే క్రమంలో మంగళవారం అర్ధరాత్రి అదుపుతప్పి లారీ మధ్య భాగంలో ఢీకొంది. దీంతో జోరు ధ్వంసమై ముందు టైరు ఊడిపోయి 150 మీటర్ల దూరంలో ఎగిరిపడింది. కారులో ఎయిర్ బెలూన్‌లు ఓపెన్ కావడంతో అందులో ఉన్న ఇద్దరు స్వల్ప గాయలతో బయటపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు 108 వాహనంలో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆదివాసీ చట్టాలను అమలుచేయాలి



వెంకటాపురం(కె) : ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా భూముల క్రయ విక్రయాలు చేస్తున్నారని, గిరిజనేతరులు ఇంటి నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, పూనెం రామచందర్, మునేశ్వరావు, కృష్ణ, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

గుడుంబా స్వాధీనం.. ఒకరిపై కేసు



వాజేడు : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి నిషేధిత గుడుంబా (సారా)ను తీసుకు వస్తున్న తాడి రాజుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పేరూరు ఎస్సై రమేశ్ తెలిపారు. మండల పరిధిలోని చంద్రుపట్ల క్రాస్ వద్ద జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వెంకటాపురం(కె) మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామానికి చెందిన తాడి రాజు తన బైక్‌పై 120 లీటర్ల నిషేధిత గుడుంబాను తీసుకువస్తున్నట్లు తెలిపారు. గుడుంబాతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకొని రాజుపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి

మహాముత్తారం : మండలంలోని రెడ్డిపల్లి శివారు అటవీ ప్రాంతంలోని గుడుంబా తయారీ కేంద్రాలపై ఎస్సై మహేందర్‌కుమార్ తన సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 6,600 లీటర్ల చెక్కెర ద్రావణాన్ని ధ్వంసం చేసి సుమారు 220 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై వెంట సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం

కాటారం : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విలాసాగర్‌కు చెందిన విద్యార్థులను బుధవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అందె సత్యనారాయణ ఆధ్వర్యంలో సన్మానించారు. విద్యార్థులకు శాలువాలు కప్పి షీల్డులు అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించడం సంతోషకరమని అభినందించారు. పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల రమేశ్, మాజీ సర్పంచ్ తెప్పల దేవేందర్‌రెడ్డి, నాయకులు పొలాడి సాగర్‌రావు, కటకనేని సంతోష్‌రావు, సారయ్య, చిగురు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో అవకతవకలు

చిట్యాల : మండలంలోని నవాబుపేట గ్రామంలో చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో అవకతవకలు జరుగుతున్నాయని పలువురు గ్రామస్తులు ఎంపీడీఓ జయశ్రీకి బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో పనికి రాకున్నా హాజరు వేసి డబ్బులు వచ్చేలా చేస్తున్నారని వారు పేర్కొన్నారు. కాగా పనికి వచ్చే నిజమైన కూలీలకు అన్యాయం జరుగుతుందని, ఎంపీడీఓ సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాము, శ్రీనివాస్, సాంబయ్య, రాజ్‌కుమార్, దేవేందర్, రాము, రమణ కుమార్ తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



వెంకటాపురం(కె): సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కన్నాయిగూడెం: జెండా ఎగురవేస్తున్న కార్మికులు



ఘనంగా మేడే వేడుకలు

ములుగు రూరల్ : మండలంలోని కాశిందేవిపేట, జంగాలపల్లి, మల్లంపల్లి, అబ్బాపూర్, పొట్లాపూర్, రాయినిగూడెం, లాలాయిగూడెం, జగ్గన్నగూడెం గ్రామాల్లో మే డే వేడుకలను సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అమ్జద్‌పాషా మాట్లాడుతూ.. దేశంలో 1886 సంవత్సరంలో అసంఘటిత కార్మికులంతా ఐక్యపోరాటాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించుకుందన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం నేడు నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు. మేడే స్ఫూర్తితో బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయకుండా ఉద్యోగులను శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఇంజం కొమురయ్య, బోడ రమేష్, నటరాజ్, పరంసింగ్, సాంబునాయక్, మహేందర్, లింగస్వామి, ముత్తయ్య, కృష్ణ, సాంబయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం : మండల వ్యాప్తంగా కార్మికులు మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు జెండా ఎగరవేసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంజీవ హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పదేళ్ల పాలించిన బీజేపీ ప్రభుత్వం పనిభారం పెంచిందని విమర్శించారు. 8గంటలు ఉన్న పని గంటలను 12 గంటలకు పొడిగించిందన్నారు. వెంటనే కార్మికులకు చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం సీఐటీయూ నాయకుడు కావిరి సుధాకర్ మాట్లాతూ.. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు పూర్తిగా కార్మికులకు వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, శ్రీలత, సమ్మయ్య, సదానందం, సురేష్, రంజిత్, నగేష్‌తో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలల్లో పని చేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె) మండలంలో..

వెంకటాపురం(కె) : ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మే డే వేడుకలను సీపీఎం, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం వేర్వేరుగా నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, సీపీఎం మండల కార్యదర్శి కుమ్మరి శ్రీను పార్టీ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తు వారికి అండగా ఉంటున్న పార్టీలు సీపీఎం, సీపీఐ మాత్రమేనని అన్నారు. సీపీఎం నాయకులు కట్ల నర్సింహాచారి, గ్యానం వాసు, వంకా రాములు, తోట నాగేశ్వరావు, చిట్టెం ఆదినారాయణ, సీపీఐ నాయకులు కట్ల రాజు, సంఖ్య ఆదినారాయణ, కొండయ్య, శ్రీను, నాగూర్ మూర్తి, తదితరులు ఉన్నారు.

వాజేడులో..

వాజేడు : మండల కేంద్రంలో మే డే(కార్మిక దినోత్సవం) ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు వాడవాడలా కార్మిక సంఘాల జెండాలను ఎగుర వేశారు. వాజేడు, ఏడ్జర్లపల్లి, ధర్మవరం, పేరూరు, కొంగాల, గుమ్మడి దొడ్డితొ పాటు ఆయా గ్రామాల్లో జెండాలను ఎగుర వేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రఘుపతి మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాయడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు.

కార్మిక హక్కుల కోసం పోరాడాలి

ఎస్ఎస్‌తాడ్వాయి : కార్మికులంతా హక్కుల కోసం పోరాడాలని ములుగు జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు బండి నర్సయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మార్కెట్ గోదాం ఆవరణలో కార్మిక దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించి మే డే జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని దశబ్దాల నుంచి కార్మికులు, కూలీలు కొట్లాడి సాధించుకున్న చట్టాలను మోదీ ప్రభుత్వం చట్టసభల్లో ఎటువంటి చర్చలు జరపకుండా కార్మికుల పొట్టకొడుతుందన్నారు. కార్పొరేట్ పెట్టుబడి విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో హమాలీ యూనియన్ సివిల్ సప్లయాస్ కార్మికులు బండారి శ్రీనివాస్, నాగేశ్వరరావు, నర్సింగరావు, చంద్రప్రకాష్, వాసం శ్రీనివాస్, ప్రణయ్, గొప్ప ఉదయ్, వట్టం రాంబాబు, తాటి మహేష్, సమ్మయ్య, అశోక్, సుధాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మంగపేటలో..

మంగపేట : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సంఘటిత, అసంఘటిత కార్మికులు బుధవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గృహనిర్మాణ, హమాలీ తదితర రంగాల కార్మికులు మంగపేట, కమలాపురం, రాజుపేట గ్రామాల్లో జెండా ఆవిష్కరించి కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ఒకరికొకరు మేడే శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల కార్మికులు, సంఘాల నాయకులు, సీఐటీయు, సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మంగపేట: రాజుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

భూపాలపల్లి అర్బన్ : ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మే డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీపీఐ, సీపీఎం, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏరియాలోని యూనియన్ కార్యాయాలు, బొగ్గు గనులు, ప్రధాన కూడళ్ల వద్ద ఆయా సంఘాల నాయకులు జెండాలు ఎగరవేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి హాజరయ్యారు.

గుర్రంపేటలో..

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట గ్రామంలో మే డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తాపీ, సెంట్రింగ్, కమ్మరి, కుమ్మరి కార్మికులు గ్రామంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్మిక యూనియన్ సంఘం ఉపాధ్యక్షుడు నార్లపురం రంగయ్య, సావడి స్వామి, దూడపాక సదానందం, దూడపాక నరేష్, తాండ్ర సురేష్, మరాటి సాంబయ్య, రత్నం నరేష్, దూడపాక ఓదెలు, మధు, దూడపాక రాజయ్య, ప్రేమ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మహాముత్తారంలో..

మహాముత్తారం : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. మినిగూడ్స్ సంఘం మండల అధ్యక్షుడు లింగమల్ల సడువలి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం చిన్న రాజేందర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు మల్లయ్య, హమాలి సంఘం అధ్యక్షుడు ప్రసాద్, పోశయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చల్లగరిగ, జూకల్, అందుకుతండా, నైన్‌పాక, ఒడితలతో పాటు పలు గ్రామాల్లో మే డే దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గోదాం హమాలీ సంఘం, వెంకట్రావుపల్లి గ్రామంలో హమాలి సంఘం నాయకుడు పుల్ల సమ్మయ్య జెండా ఎగురవేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య, నాయకులు దొడ్డి కిష్టయ్య, ఎంపీటీసీ దబ్బెట అనిల్, హమాలీ సంఘం కార్మికులు భద్రయ్య, శైలేందర్, మల్లయ్య, ఐలయ్య, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేగొండలో..

రేగొండ(కొత్తపల్లిగోరి) : రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో మే డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రేగొండ మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి పెంట రవి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు సమ్మిరెడ్డి, గుంటి చంద్రమౌళి, జిల్లా సహాయ కార్యదర్శి పైళ్ల శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిగోరిలో..

కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో హమాలీ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు దొంతుల శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూదనబోయిన ఓంప్రకాష్, తుమ్మనపల్లి ఓమాజీ, నిమ్మల రాజు, సంఘం సభ్యులు దేవేందర్, గోపాల్, శ్రీనివాస్, ఐలయ్య, వెంకటేష్, కుమారస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.



వాజేడు: జెండా ఎగుర వేస్తున్న రఘుపతి



వాజేడు: సీఐటీయూ జెండా ఎగుర వేస్తున్న సామ్మ



ములుగు రూరల్: మేడే వేడుకల్లో సీపీఐ నాయకులు

మానుకోటకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



ఏటూరునాగారం: రోడ్‌షోకు వెళ్తున్న నాయకులు



గోవిందరావుపేట నుంచి..

ఏటూరునాగారం : మానుకోట పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి మాలోత్ కవిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించనున్న కేసీఆర్ రోడ్ షోలో పాల్గొనడానికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఏటూరునాగారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట నుంచి..

గోవిందరావుపేట : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మహబూబాబాద్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోకు మండల కేంద్రం నుంచి ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి మధుసూదన్ రెడ్డి, లకావత్ చందులాల్, పృథ్వీరాజ్, కొమురయ్య, సాంబయ్య, వెంకన్న, వెంకట్రాం, రాకేష్, తిరుపతి, లచ్చురామ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు ఆయిల్ పామ్‌తోట దగ్ధం


రేగొండ : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఆయిల్ పామ్ తోట దగ్ధమైన సంఘటన మండలంలోని రేపాకపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. రేపాకపల్లికి చెందిన మెరుగు శేఖర్ రెండు ఎకరాల భూమిలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాడు. కాగా మంగళవారం రాత్రి పక్కనే ఉన్న ఓ రైతు తన చేనులో చెత్తకు నిప్పు పెట్టగా మంటలు ఆయిల్ పామ్ తోటకు వ్యాపించాయి. బుధవారం వెళ్లి చూడగా తోటలోని డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. గెలలు వేసి పంట విక్రయించుకునే సమయంలో కాలిపోవడంతో రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరారు.

మొక్కజొన్న పంట దగ్ధం

కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మొక్కజొన్న పంట దగ్ధమైంది. జగ్గయ్యపేటకు చెందిన రైతులు కావడి కుమార్, గుజ్జుల శ్రీనివాస్ మొక్కజొన్న పంటను సాగు చేశారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా చేను పూర్తిగా దగ్ధమైందని రైతులు ఆరోపిస్తున్నారు.

గడ్డివాము..

టేకుమట్ల : మండలంలోని గర్మిళ్లపల్లిలో షార్ట్‌సర్క్యూట్‌తో శ్యామల లింగారెడ్డి, నల్లబెల్లి జయపాల్‌కు చెందిన గడ్డివాములు కాలిపోయాయి. చుట్టుపక్కల ప్రజలు అప్రమత్తమై నీళ్లు చల్లి మంటలు ఆర్పివేశారు.



కాలిపోయిన ఆయిల్‌పామ్ తోట

షార్ట్ సర్క్యూట్‌తో ధాన్యం, పశుగ్రాసం..

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ధాన్యం, పశుగ్రాసం దగ్ధమైన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని దుబ్యాలలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతు సంగి రవి కథనం ప్రకారం.. తనకున్న ఆరు ఎకరాలలో వరి పంట (మేల్, ఫిమేల్) సాగు చేశాడు. బుధవారం విద్యుత్ వైర్లు గాలికి ఒకదానితో ఒకటి తాకడంతో నిప్పురవ్వ చెలరేగి ముందుగా పశుగ్రాసం అంటుకుని మంటలు వ్యాప్తించాయని తెలిపారు. మంటల్లో మగ వరి ధాన్యంతో పాటు, రెండు విద్యుత్ మోటార్లు, పైపులు సైతం దగ్ధమయ్యాయని రోదించాడు. స్థానిక ఎంపీటీసీ బిక్కినేని అనిత సంపత్ రావు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షలు నష్టపోయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. నష్టపోయిన బాధిత రైతు రవిని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీటీసీ కోరాడు.

‘ఎంపీగా బలరాం నాయక్‌ను గెలిపించాలి’

గోవిందరావుపేట : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు మండల పరిధిలోని పస్రా గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ అధ్యక్షతన క్లస్టర్ ఇన్‌చార్జ్ పన్నాల ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం చేశారు. ఇందులో భాగంగా పన్నాల ఎల్లారెడ్డి గడప గడపకు తిరుగుతూ ప్రజలకు గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాల గురించి తెలియజేశారు. బలరాం నాయక్ చేసిన పనులను ప్రజలకు వివరిస్తు హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రతీ ఒక్కరిని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.500కు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, ప్రతి నియోజకవర్గానికి మొదట విడతగా 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారని తెలిపారు. ఆగస్టు 15 వరకు రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని చెబుతూ ప్రతి ఒక్కరిని చేతి గుర్తుకు ఓటు వేసి బలరాంనాయక్‌ని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులుగుజ్జు వెంకన్న, గ్రామ అధ్యక్షుడు బద్దం లింగారెడ్డి, భూక్యా సుమలత, చెరుకుల సురేష్, జిల్లా, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

ఎస్ఎస్‌తాడ్వాయి : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు న్యాయం జరుగుతుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటేసి ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలను పట్టించుకోలేదన్నారు. ప్రధాని మోదీ జన్‌ధన్ ఖాతాలో పేదలకు రూ.15లక్షల చొప్పున నగదు వేస్తానని పదిపైసలు కూడ ఇవ్వలేదన్నారు. నిత్యావసర సరుకులు ధరలు భారీగా పెంచడంతో పేదలకు భారంగా మారిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, రూ.2లక్షల రైతురుణమాఫీ చేస్తామని సీఎం రేవంతర్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. బలరాం నాయక్‌ను గెలిపిస్తే మంత్రి సీతక్క గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఎన్నికల తర్వాత అర్హులైన ప్రతీ ఒక్కరి ఇందిరమ్మ ఇళ్లు మంజూరువుతాయన్నారు.కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, సింగిల్ విండో డైరెక్టర్లు యానాల సిద్ధిరెడ్డి, జగన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, మండల నాయకులు పిట్టల సారయ్య, అనుమాండ్ల రాజిరెడ్డి, సాధు చక్రపాణి, కల్తీ రమేష్, కల్లెబోయిన రాజయ్య, మధు పాల్గొన్నారు.



ఎస్ఎస్‌తాడ్వాయి : కూలీలతో మాట్లాడుతున్న దేవేందర్



గోవిందరావుపేట : పస్రాలో ఓటర్లతో మాట్లాడుతున్న పన్నాల ఎల్లారెడ్డి

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ములుగు రూరల్ : బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని లేబర్ ఆఫీసర్ వినోద అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని బండారుపల్లి ఇటుక బట్టీల వద్ద జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, లేబర్ డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో ఇటుక బట్టిల వద్ద ప్రపంచ కార్మికుల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మైనర్‌లను బడిలో చేర్పించాలని, పనిలో కాదన్నారు. కార్మికులు పని చేసే పని ప్రదేశాల్లో యజమానులు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్మికులకు 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్, చంద్రయ్య, సునిల్ కుమార్, రాచర్ల రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద